సాక్షి
పశ్చిమగోదావరి
గురువారం । 28 । సెప్టెంబర్ । 2023



అదరహో.. పీఆర్-126

ఖరీఫ్ సీజన్‌లో పీఆర్-126 రకం వరి వంగడాన్ని సాగు చేసిన రైతుల మోములో ఆనందం వెల్లివిరుస్తోంది. నాణ్యమైన దిగుబడులు వస్తున్నాయి. 8లో ▸



బాధితులను ఆదుకుంటాం

పాశ్చానగరంలో పిడుగుపాటుకు గురై మహిళా కూలీలు మృతి చెందిన ఘటనలో బాధిత కుటుంబాలను ఆదుకుంటామని ఇన్‌చార్జి సబ్ కలెక్టర్ తెలిపారు. 8లో ▸



తొలి తీర్పు

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ప్రజాసమస్యల శాశ్వత న్యాయపీఠం ఏలూరులో బుధవారం తొలితీర్పును వెలువరించినట్లు శాశ్వత లోక్ అదాలత్ చైర్‌పర్సన్ తెలిపారు. 8లో ▸

న్యూస్‌రీల్

కాంట్రాక్ట్ ఉద్యోగుల సర్వీసుల క్రమబద్ధీకరణపై హర్షం



చోడగిరి శ్రీనివాస్, జేఏసీ చైర్మన్

ఏలూరు(మెట్రో): ప్రభుత్వం కాంట్రాక్ట్ ఉద్యోగుల సర్వీసులను రెగ్యులరైజ్ చేయడంపై జిల్లా ఎన్‌జీఓ అధ్యక్షుడు, జేఏసీ చైర్మన్ చోడగిరి శ్రీనివాస్, కన్వీనర్ నెరుసు రామారావు హర్షం వ్యక్తం చేశారు. బుధవారం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బిల్లులో 20 ఏళ్ల నుంచి క్రమబద్ధీకరణ కోసం ఎదురుచూస్తున్న సుమారు 15,000 మంది కాంట్రాక్టు ఉద్యోగుల సర్వీసులను రెగ్యులరైజ్ చేస్తూ ఆమోదం తెలపడంపై ప్రభుత్వానికి, సీఎం జగన్‌కు, మంత్రి వర్గ ఉప సంఘానికి కృతజ్ఞతలు తెలిపారు. అదే విధంగా సీపీఎస్ రద్దు విషయంలో ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై పునరాలోచించాలని కోరారు. డీఏను దసరా కానుకగా ఇస్తామని సీఎం జగన్ చెప్పారని, సరెండర్ లీవ్స్, జీపీఎఫ్, ఏపీజీఎల్ఐ రుణాలు, ఫైనల్ పేమెంట్స్ వెంటనే వెంటనే విడుదల చేయాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు.

ఉత్సాహంగా సైనిక్ శిక్షణ

నరసాపురం: స్థానిక వైఎన్ కళాశాలలో 7 ఆంధ్రా నేవల్ యూనిట్ ఆధ్వర్యంలో సైనిక్ శిక్షణా శిబిరం ఉత్సాహంగా సాగుతోంది. బుధవారం శిక్షణా శిబిరాన్ని గ్రూపు కమాండర్ (కాకినాడ) సవ్యసాచి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నరసాపురం 7ఆంధ్రా నేవల్ యూనిట్‌కు దేశవ్యాప్తంగా మంచి పేరుందన్నారు. నేవల్ క్యాడెట్‌గా పనిచేయడం ద్వారా క్రమశిక్షణ, వ్యక్తిత్వ వికాసం, నాయకత్వ లక్షణాలు అలవడతాయన్నారు. క్యాడెట్స్‌కు శిక్షణలో భాగంగా ఫైరింగ్, బోట్ పుల్లింగ్, షిప్ మోడలింగ్ వంటి అంశాల్లో శిక్షణ ఇచ్చారు. కమాండర్ హరిప్రీత్‌సింగ్, కళాశాల ప్రిన్సిపాల్ ఏవీవీ అప్పారావు, డీన్ గంధం రామకృష్ణ పాల్గొన్నారు.

మెజిస్ట్రేట్ పోస్టులకు దరఖాస్తులు

ఏలూరు (టూటౌన్): ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా పరిధిలోని ఏలూరు, తాడేపల్లిగూడెం, నరసాపురం, పాలకొల్లు, కొవ్వూరులో ఖాళీగా ఉన్న సెకండ్ క్లాస్ స్పెషల్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ పోస్టుల తాత్కాలిక భర్తీకి ప్యానెల్‌లో తమ పేర్లను చేర్చడం కోసం అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.పురుషోత్తంకుమార్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి జిల్లా పరిధిలో ఆరు ఖాళీలు ఉన్నాయని పేర్కొన్నారు. అర్హులైన అభ్యర్థులు తమ దరఖాస్తులను నిర్దేశిత ఫార్మెట్‌లో, అర్హతల ధ్రువీకరణ పత్రాల నకళ్లు అటెస్ట్ చేసినవి, మూడు ఫొటోలతో జిల్లా జడ్జి, ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా, ఏలూరు కార్యాలయానికి వచ్చేనెల 5వ తేదీ సాయంత్రం 5 గంటలోపు అందేలా పంపాలని సూచించారు. ఎంపికైన వారికి నెలకు రూ.30 వేలు గౌరవ వేతనంగా చెల్లిస్తామని, నోటిఫికేషన్‌ను ఏలూరు, భీమవరం కలెక్టరేట్లు, జిల్లాలోని అన్ని కోర్టుల్లోని నోటీసు బోర్డులు, ఏలూరు, భీమవరం జిల్లాల్లోని బార్ అసోసియేషన్ కార్యాలయాల నోటీసు బోర్డుల్లో ప్రదర్శించాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి పురుషోత్తంకుమార్ ఆదేశించారు.

క్షీరారామంలో హుండీ ఆదాయం లెక్కింపు

పాలకొల్లు సెంట్రల్: పంచారామక్షేత్రం పాలకొల్లు క్షీరారామలింగేశ్వరస్వామి ఆలయంలో హుండీ ఆదాయాన్ని బుధవారం లెక్కించారు. 195 రోజులకు రూ.17,88,706 ఆదాయం లభించినట్టు ఈఓ యాళ్ల సూర్యనారాయణ తెలిపారు. భీమవరం డివిజన్ అధికారి వర్ధినీడి వెంకటేశ్వరరావు పర్యవేక్షణలో లెక్కింపు జరిగిందని, ఆలయ చైర్మన్ కోరాడ శ్రీనివాసరావు, ట్రస్ట్‌బోర్డు సభ్యులు పాల్గొన్నారన్నారు.

ఆరోగ్య రథ చక్రాలు

జిల్లాలో వాహనాలు

108	104	102
23	33	14

108 వాహన సేవలు

నియోటల్ వాహనం	1,000
బీఎల్ఎస్ వాహనం	28,000
ఏఎల్ఎస్ వాహనం	7,000

102 వాహన సేవలు

11,222

104 వాహన సేవలు

ఓపీ సేవలు	12,41,526
రక్తపోటు పరీక్షలు	5,09,652
షుగర్ పరీక్షలు	4,55,169
జ్వరాల కేసులు	13,326
ఈసీజీ	22,308
హౌస్ విజిట్	18,308
ఆస్పత్రులకు సిఫార్సు	11,234

ప్రజారోగ్యమే పరమావధి

- 108, 104, 102 వాహనాలు
- ఆపదలో ఉన్న వారిని రక్షిస్తూ..
- జిల్లాలో పూర్తిస్థాయిలో సేవలు
- వాహనాలను వినియోగించుకుంటున్న ప్రజలు



తణుకులో 102 వాహనంలో బాలింతను ఇంటికి చేరుస్తున్న దృశ్యం

భీమవరం(ప్రకాశం చౌక్): ప్రజారోగ్యమే పరమావధిగా ప్రభుత్వం వైద్య సేవలందిస్తోంది. ఆపదలో ఉన్నవారిని రక్షించేందుకు 108, సంచార వైద్యం అందించేలా 104, తల్లీబిడ్డల ఆరోగ్య రక్షణకు 102 వాహనాల ద్వారా సేవలందిస్తోంది. పశ్చిమగోదావరి జిల్లాలో ఈ వాహనాల సేవలు ముమ్మరంగా అందుతున్నాయి. పేదల ఆరోగ్య భద్రతలో ప్రముఖ పాత్ర పోషిస్తున్నాయి. ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి విద్య, వైద్యానికి అధిక ప్రాధాన్యమిస్తున్నారు. దీనిలో భాగంగా నాడు-నేడు కార్యక్రమంలో ప్రభుత్వాస్పత్రులు, ఆరోగ్య కేంద్రాలను అభివృద్ధి చేస్తున్నారు. అలాగే 108, 104, 102 వాహనాల ద్వారా విశేష సేవలు అందించేలా చర్యలు తీసుకున్నారు. గత ప్రభుత్వంలో అరకొరగా మాత్రమే సేవలందగా.. ప్రస్తుతం పూర్తిస్థాయిలో ప్రజలకు ఆరోగ్య వాహనాలు సేవలందిస్తున్నాయి.

జిల్లాలో పూర్తిస్థాయిలో..

జిల్లాలో 20 మండలాలు ఉండగా ప్రతి మండలంలో 108 వాహనాలు అందుబాటులో ఉన్నాయి. ప్రభుత్వం ప్రతి మండలానికి 104 వాహనం అందించడంతో పాటు అదనంగా మరిన్ని వాహనాలు సమకూర్చింది. అలాగే జిల్లాలోని 18 ప్రభుత్వాస్పత్రుల వద్ద 102 వాహనాలు 14 అందుబాటులో ఉంటూ బాలింతలకు సేవలందిస్తున్నాయి.

తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్‌గా 102

తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్‌గా 102 వాహన సేవలందిస్తున్నారు. ప్రభుత్వాస్పత్రుల్లో ప్రసవం అనంతరం తల్లీబిడ్డలను సురక్షితంగా వారి ఇంటికి ఈ వాహనాల ద్వారా చేరుస్తున్నారు. అలాగే హైరిస్క్, అధిక రక్తహీనత ఉన్న గర్భిణులను కూడా ఈ వాహనాల ద్వారా ఆస్పత్రులకు తీసుకువెళ్లి వైద్య సేవలందించి తీసుకువస్తున్నారు.

అధునాతనంగా 108



సీఎం జగన్ ప్రత్యేక శ్రద్ధతో ఫుల్ లోడ్ హెడ్ 108 అంబులెన్స్‌లను తీసుకువచ్చారు. ఈ వాహనంలో ఆక్సిజన్, వెంటిలేటర్ వంటి అధునాతన సౌకర్యాలు ఉన్నాయి. వాహనంలో మెడికల్ టెక్నీషియన్, వైద్య సిబ్బంది ఉంటారు. క్షతగాత్రులను, బాధితులను సకాలంలో ఆస్పత్రులకు చేర్చేందుకు వీరి కృషి చేస్తున్నారు. తీవ్రమైన పరిస్థితుల్లో ఆక్సిజన్, వెంటిలేటర్‌తో ప్రాణాలను నిలబెడుతున్నారు.

108 రకాలు.. సౌకర్యాలు

108 అంబులెన్సుల్లో నియోనాటల్, అడ్వాన్స్‌డ్ లైఫ్ సపోర్ట్ (ఏఎల్ఎస్), బేసిక్ లైఫ్ సపోర్టు (బీఎల్ఎస్) అనే మూడు రకాలు ఉన్నాయి. నియోనాటల్ అంబులెన్స్ జిల్లాలో ఒకటి ఉంది. దీనిని 28 రోజుల వయసులోపు శిశువులను ఆస్పత్రికి తరలించేందుకు ఉపయోగిస్తారు. దీనిలో వెంటిలేటర్, ఇంక్యుబేటర్లు, చార్జ్ బ్లాంకెట్, ఆక్సిజన్ సౌకర్యాలు ఉన్నాయి. ఏఎల్ఎస్ అంబులెన్స్‌లో ఎలక్ట్రికల్ షాక్‌లు ఇచ్చే డిఫిబ్రిలేటర్, వెంటిలేటర్, ఆక్సిజన్ సౌకర్యాలు ఉన్నాయి. బీఎల్ఎస్ అంబులెన్సుల్లో బీపీ పల్స్ రేట్ పరీక్షించే మానిటర్, సిరంజీ ఇన్ఫ్యూజన్, వాల్యూమ్ ఇన్ఫ్యూజన్ ఆక్సిజన్ సరఫరా ఉంటుంది.



పాలకోడేరు మండలం కొండేపూడిలో 104 వాహనంతో వైద్యులు, సిబ్బంది

సంచార వైద్య సేవ 104 ప్రత్యేకం

గ్రామాల్లో తిరుగుతూ 104 వాహనాలు వైద్య సేవలందిస్తున్నాయి. వైద్య సిబ్బంది 104 వాహనంలో సంచరిస్తూ ఉదయం నుంచి సాయంత్రం వరకు గ్రామంలో ఉండి సేవలు అందిస్తారు. ఈ వాహనాల్లో 30 రకాల వైద్యారోగ్య పరీక్షల కోసం పరికరాలు ఉంటాయి. గ్రామీణ ఆరోగ్యానికి ఈ వాహన సేవలు కీలకం. ప్రతి గ్రామంలో నెలకు రెండు సార్లు విలేజ్ హెల్త్ క్లినిక్‌ల పరిధిలో ఈ వాహనాలు సేవలందిస్తాయి. వాహనాల ద్వారా వైద్య శిబిరాలు కూడా నిర్వహిస్తారు. స్థానిక పీహెచ్‌సీ వైద్యులు, హెల్త్ సూపర్‌వైజర్లు, ఎంఎల్‌హెచ్‌పీ, ఆశ వర్కరు, నర్సు సేవలందిస్తారు. 104 వాహనంలో డీఈఓ, పైలెట్ కూడా ఉంటారు. ఆరోగ్య పరీక్షలతో పాటు ఉచితంగా మందులు కూడా అందిస్తారు.

సద్వినియోగం చేసుకోండి



ప్రజారోగ్యానికి ప్రభుత్వం సమకూర్చిన 104, 102 వాహన సేవలను సద్వినియోగం చేసుకోవాలి. జిల్లావ్యాప్తంగా అన్ని మండలాల్లో 104 వాహనాల వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయి. 104 వాహనం ద్వారా వైద్య పరీక్షలతో పాటు ఉచితంగా మందులు పంపిణీ చేస్తారు. గర్భిణులు, బాలింతలకు వైద్య సేవల కోసం 102 వాహనాలను ప్రత్యేకంగా నిర్వహిస్తున్నారు. డెలివరీ అయిన వారిని ఇంటికి చేర్చడంతో పాటు హైరిస్క్ గర్భిణులను తరలించడానికి ఈ వాహనాలు ఉపయోగపడుతున్నాయి.

– డి.మహేశ్వరరావు, జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి, భీమవరం

'జగనన్నకు చెబుదాం'తో సత్వర పరిష్కారం

కలెక్టర్ ప్రశాంతి



సమస్యలు వింటున్న కలెక్టర్ ప్రశాంతి

నరసాపురం: సమస్యల పరిష్కారమే లక్ష్యంగా జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిందని కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. బుధవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలు తమ సమస్యల పరిష్కారానికి కలెక్టరేట్‌కు రానవసరం లేకుండానే ప్రభుత్వ ఆదేశాలతో ఈ కార్యక్రమం చేపట్టామన్నారు. కలెక్టరేట్‌లో ప్రతి సోమవారం జరిగే స్పందన కార్యక్రమం మాదిరిగా ఇక్కడా ఫిర్యాదులు, అర్జీలు స్వీకరించి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. బుధ, శుక్రవారాల్లో జిల్లాలోని ఒక్కో మండలంలో కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. తొలుత నరసాపురం మండలానికి సంబంధించి జగనన్నకు చెబుదాం పెండింగ్ ఫిర్యాదులపై జాయింట్ కలెక్టర్ ఎస్.రామసుందర్‌రెడ్డి సమీక్షించారు. మొత్తం 11 ఫిర్యాదులు అందినట్టు కలెక్టర్ ప్రశాంతి చెప్పారు. నరసాపురం ఇన్‌చార్జ్ సబ్‌కలెక్టర్ కె.కృష్ణవేణి, నరసాపురం డీఎస్పీ కె.రవిమనోహరాచారి, మున్సిపల్ కమిషనర్ కె.వెంకటేశ్వరరావు, తహసీల్దార్ ఎండీ ఫాజిల్ పాల్గొన్నారు.

పర్యాటకం.. మానవ వికాసానికి దోహదం

డీఆర్వో కృష్ణవేణి



పర్యాటక దినోత్సవాల్లో మాట్లాడుతున్న డీఆర్వో

సాక్షి, భీమవరం: మానవ వికాసానికి, విజ్ఞానానికి, వినోదానికి పర్యటనలు, పర్యాటక ప్రాంతాలు దోహదపడతాయని, భాషలు, సంస్కృతి, సంప్రదాయాలు తెలుస్తాయని జిల్లా రెవెన్యూ అధికారి కె.కృష్ణవేణి అన్నారు. బుధవారం ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా భీమవరం డీఎన్నార్ కళాశాలలో నిర్వహించిన వేడుకల్లో ఆమె మాట్లాడారు. జిల్లాలో పలు పర్యాటక ప్రాంతాలు ఉన్నాయని, పేరుపాలెం బీచ్, కొల్లేరు సరస్సు, టెంపుల్ టూరిజం వంటివి ముఖ్యమైనవన్నారు. పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేయాల్సిన బాధ్యత అందరిపై ఉందని, పర్యాటక రంగంలో అవకాశాల్ని విద్యార్థులు ఉపయోగించుకోవాలన్నారు. భీమవరం ఆర్డీఓ దాసి రాజు మాట్లాడుతూ పర్యాటక రంగం మానవాళి జీవన విధానాన్ని ప్రభావితం చేయడంతో పాటు రాష్ట్ర, దేశ జీడీపీని పెంచడంతో ప్రముఖ పాత్ర పోషిస్తుందన్నారు. జిల్లాలో పర్యాటక అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని, సీఎం జగన్ ప్రత్యేక చొరవ చూపుతున్నారన్నారు. జిల్లా పర్యాటక శాఖ అధికారి ఎండీహెచ్ మెహరాజ్ మాట్లాడుతూ జిల్లాలో పర్యాటకులను ఆకర్షించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. విద్యార్థుల్లో టూరిజంపై అవగాహన పెంచేందుకు ప్రభుత్వ పాఠశాలల్లో యూత్ క్లబ్బులు ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు. అనంతరం పర్యాటక రంగంపై నిర్వహించిన వ్యాసరచన, పెయింటింగ్, క్విజ్ పోటీల్లో విజేతలకు షీల్డ్స్, సర్టిఫికెట్లు అందజేశారు. ముందుగా పట్టణంలో విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. కళాశాల ఉపాధ్యక్షుడు గోకరాజు పాండురంగరాజు, ప్రిన్సిపాల్ బీఎస్ శాంతకుమారి, ఎన్ఎస్ఎస్ అధికారి అనిల్ దేవ్, ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ అధికారి ప్రవీణ్ కృష్ణ, సెట్‌వెల్ సూపరింటెండెంట్ జాన్ కెన్నెడీ, టూరిజం ఇన్ఫర్మేషన్ అధికారి ఎ.మురళీకృష్ణ పాల్గొన్నారు.

రైతులకు దిక్సూచిగా 'పొలంబడి'



గణపవరం మండలం అప్పన్నపేటలో రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి

గణపవరం: రైతులకు దిక్సూచీగా డాక్టర్ వైఎస్సార్ పొలంబడి కార్యక్రమం నిలుస్తుందని, రైతులంతా పొలంబడిలో చేరి మేలైన పద్ధతుల ద్వారా వ్యవసాయాన్ని లాభసాటిగా చేసుకోవాలని పశ్చిమగోదావరి జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి సూచించారు. బుధవారం మండలంలోని అప్పన్నపేట గ్రామంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో వైఎస్సార్ క్లస్టర్ పొలంబడి కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులంతా క్రమం తప్పకుండా పొలంబడి కార్యక్రమంలో పాల్గొని వ్యవసాయంలో నూతన సాంకేతికను అందిపుచ్చుకోవాలని, తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు సాధించాలన్నారు. పొలంబడి కార్యక్రమం ద్వారా వ్యవసాయ నిపుణుల ద్వారా రైతులకు సూచనలు, సలహాలు అందిస్తున్నామన్నారు.

రసాయనాల వినియోగం తగ్గించాలి

వ్యవసాయంలో రసాయనాల వినియోగాన్ని గణనీయంగా తగ్గించాల్సిన అవసరాన్ని రైతులు గుర్తించాలని ఆమె అన్నారు. దీనికి ప్రత్యామ్నాయంగా సేంద్రియ ఎరువులు, పురుగు మందులు వినియోగాన్ని పెంచాలన్నారు. ఆరోగ్య పంటలు పండించాలన్నారు. పొలంబడి కార్యక్రమం ద్వారా రైతులు ఎంత మేర అనుభవం పొందారో ఆమె ఆరా తీశారు. రైతుల సమాధానాలపై సంతృప్తి వ్యక్తం చేశారు.

చాలా నేర్చుకున్నాం

కె.రామారావు అనే రైతు మాట్లాడుతూ తాను పొలంబడి కార్యక్రమంలో చాలా నేర్చుకున్నానని, ముఖ్యంగా అనవసరంగా ఎరువులు, పురుగు మందుల వాడకం అవగతమైందన్నారు. ఇళ్ల వెంకట్రావు అనే రైతు మాట్లాడుతూ పొలంబడి ద్వారా తాను మిత్ర, శత్రు పురుగులపై పూర్తి అవగాహన పొందానని, మిత్ర పురుగుల సంరక్షణ చర్యలు తెలుసుకున్నానన్నారు. డ్రోన్ ద్వారా పిచికారీని కలెక్టర్ ప్రశాంతి పరిశీలించారు. మండల వైఎస్సార్‌సీపీ బాధ్యుడు పుప్పాల చినబాబు, జిల్లా వ్యవసాయ అధికారి జెడ్.వెంకటేశ్వరరావు, జిల్లా వ్యవసాయ సలహా సంఘం చైర్మన్ కైగాల శ్రీనివాసరావు, ఏడీఏ పి.మురళీకృష్ణ, తహసీల్దార్ పమ్మి లక్ష్మి, వ్యవసాయ అధికారి యర్రంశెట్టి ప్రసాద్, ఎంపీడీఓ జ్యోతిర్మయి, మార్టేరు వ్యవసాయ పరిశోధనా కేంద్రం శాస్త్రవేత్త ప్రభాతలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలను వేగిరపర్చాలి

కలెక్టర్ ప్రశాంతి

భీమవరం(ప్రకాశంచౌక్): పేదల గృహ నిర్మాణాలను వేగంగా పూర్తి చేయాలని కలెక్టర్ పి.ప్రశాంతి అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి గృహ నిర్మాణం, ప్రాధాన్యత భవనాలు, నాడు -నేడు అంశాలపై మండల అధికారులతో సమీక్షించారు. మండలాల వారీగా ప్రగతిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ లక్ష్యసాధనలో వెనుకబడిన మండలాల అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. జిల్లాలో ఇప్పటికే పూర్తయిన గృహాలకు మౌలిక వసతులను కల్పించి లబ్ధిదారులతో గృహప్రవేశాలకు సిద్ధం చేయించాలన్నారు. ముఖ్యంగా సోప్‌పిట్స్ నిర్మాణాలు, విద్యుద్దీకరణ, అంతర్గత రోడ్లు, తాగునీటి పనులు వేగిరపర్చాలన్నారు. వివిధ దశల్లో నిర్మాణాల్లో ఉన్న ఇళ్లను త్వరగా పూర్తిచేయడానికి కృషి చేయాలన్నారు. హౌసింగ్ ఏఈలు, వర్క్ ఇన్‌స్పెక్టర్లు, డిజిటల్ అసిస్టెంట్లు క్షేత్రస్థాయిలో లబ్ధిదారులతో మాట్లాడి నిర్మాణాలకు ప్రోత్సహించాలన్నారు. డిజిటల్ అసిస్టెంట్లు పనితీరును మార్చుకోవాలని లేనిచో చర్యలు తప్పవని హెచ్చరించారు. మన బడి నాడు-నేడు పనులపై సూచనలు చేశారు.

బాస్కెట్‌బాల్ సెలెక్షన్స్

వీరవాసరం: ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా అండర్-14,17 బాలుర బాస్కెట్‌బాల్ జట్ల ఎంపికలు బుధవారం వీరవాసరం ఎమ్మార్కే జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. విద్యార్థుల్లో ప్రతిభను గుర్తించి వారికి జిల్లా జట్టులో స్థానం కల్పించారు. విద్యార్థులు అంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు సూచించారు. సెలెక్షన్స్ కార్యక్రమాన్ని స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి పీఎస్ఎన్ మల్లేశ్వరరావు, పశ్చిమగోదావరి జిల్లా పీఈటీ, పీడీ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు కృష్ణారెడ్డి, మహమ్మద్ కుద్దూస్, రాష్ట్ర పీఈటీ, పీడీ అసోసియేషన్ సభ్యులు రేలంగి రామకృష్ణ, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జుత్తిగ శ్రీనివాస్ పర్యవేక్షించారు.

ఉరిమే ఉత్సాహంతో..

ఉమ్మడి జిల్లాస్థాయి స్కూల్‌గేమ్స్ పోటీలు

భీమడోలు: పోలసానిపల్లిలోని బీఆర్ అంబేడ్కర్ గురుకుల బాలికల కళాశాల ప్రాంగణంలో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాస్థాయి స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో బుధవారం అండర్-19 జిల్లాస్థాయి క్రీడాపోటీలు ఉత్సాహంగా సాగాయి. సుమారు 200 మంది విద్యార్థులు హాజరై పలు విభాగాల్లో పోటీపడ్డారు. స్పోర్ట్స్ కో-ఆర్డినేటర్ కె.జయరాజు ఆధ్వర్యంలో ప్రతిభ కనబర్చిన వారిని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎం.పద్మావతి, పీడీ సాయిలక్ష్మి, పీఈటీ ప్రమీలారాణి, కృష్ణకుమారి, మరో 25 మంది వ్యాయామ పీడీలు, పీఈటీలు పోటీలను పర్యవేక్షించారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

- **సెపక్‌తక్రా:** డి.రాజేశ్వరి (కొవ్వూరు), వి.లక్ష్మీప్రసన్న (జంగారెడ్డిగూడెం), కె.అనూష, ఈ.కిరణ్మయి (చిన్నాయగూడెం), డి.లఖిత, టి.భవితావాణి (రామశింగవరం).
- **త్రోబాల్:** ఎన్.అరిత, కె.మానస, కె.పావని (ద్వారకాతిరుమల), సీహెచ్ పల్లవి, సీహెచ్ గౌతమి (పోలసానిపల్లి), ఎం.దైవకృపానిధి, ఎస్.హసిని, బి.అనూష, వై.సిరివెన్నెల (ఏలూరు), కె.భవాని (జంగారెడ్డిగూడెం), కె.పూజా దీపిక (గోపాలపురం), సారిక (ధర్మాజీగూడెం).
- **టెన్నికాయిట్:** ఎస్కే సీమరుత్సాన (ఏలూరు), ఎన్.జయశ్రీ (గోకవరం), ఎస్.కావ్య, టి.అఖిల (పోలసానిపల్లి), ఎల్.మౌనిక (చిన్నాయగూడెం).
- **100 మీటర్ల పరుగు:** కె.అలేఖ్య (ఏలూరు), కె.కల్యాణి (దేవరపల్లి).



పరుగు పందెంలో విద్యార్థినులు



త్రోబాల్ ఆడుతున్న కళాశాలల బాలికలు

- **200 మీటర్ల పరుగు:** డి.నీలిమ (పోలసానిపల్లి), కె.కల్యాణి (దేవరపల్లి).
- **400 మీటర్ల పరుగు:** డి.నీలిమ (పోలసానిపల్లి), ఎ.పూర్ణచంద్రిక (ఏలూరు).
- **800 మీటర్ల పరుగు:** సీహెచ్ వెంకటేశ్వరమ్మ, కె.అలేఖ్య (ఏలూరు).
- **1,500 మీటర్ల పరుగు:** వి.శివదుర్గ (తాడేపల్లిగూడెం), కె.లక్ష్మీప్రసన్న (ద్వారకాతిరుమల).
- **3 కిలోమీటర్ల రేస్ వాక్:** సి.రక్షితనాగేశ్వరి (పోలసానిపల్లి), బి.భవాని (గోపాలపురం).
- **3 కిలోమీటర్ల పరుగు:** ఎం.చైతన్య, పి.సాయి (ఏలూరు).
- **5 కిలోమీటర్ల పరుగు:** పి.సౌజన్య (పోలసానిపల్లి), వి.శివదుర్గ (తాడేపల్లిగూడెం).
- **400 మీటర్ల రిలే:** కె.అలేఖ్య (ఏలూరు), కె.కల్యాణి (దేవరపల్లి), టి.సుష్మాభారతి (తణుకు), ఎస్.జేస్సి తన్మయి (ఏలూరు).
- **4 ఇన్‌టు 400 మీటర్ల పరుగు:** పి.నీలిమ (పోలసానిపల్లి), ఎ.పూర్ణచంద్రిక (ఏలూరు), కె.మంజుల (గోపాలపురం), ఎం.నాగదుర్గ (దేవరపల్లి).
- **లాంగ్‌జంప్:** పి.ప్రియాంక (జంగారెడ్డిగూడెం), ఎం.నాగదుర్గ (దేవరపల్లి).
- **హైజంప్:** ఎం.నాగదుర్గ (దేవరపల్లి), ఎస్.శిరీష (ఏలూరు).
- **ట్రిపుల్ జంప్:** ఎస్కే సీమరుత్సాన, పి.కీర్తి (ఏలూరు).
- **షాట్‌పుట్:** ఎండీఏ రహీమీష, ఎస్.జేస్సి తన్మయి (ఏలూరు).
- **జావెలిన్ త్రో:** పి.కావ్యశ్రీ (ఏలూరు), ఎస్.శృతి (ద్వారకాతిరుమల).
- **డిస్కస్ త్రో:** ఎండీఏ రహీమీష, బి.తన్మయి (ఏలూరు).
- **హేమర్ త్రో:** కె.అక్షయ (ఏలూరు), పూజిత (పోలసానిపల్లి).

క్లుప్తంగా

విద్యుదాఘాతానికి యువకుడి మృతి


సాయి (ఫైల్)

ముదినేపల్లి రూరల్: కోమర్రు పంచాయతీ పరిధిలో పచ్చిగడ్డి కోస్తూ విద్యుదాఘాతానికి గురై ఓ యువకుడు మృతి చెందాడు. వివరాలిలా ఉన్నాయి. చినకోమర్రుకు చెందిన టి.సాయి (26) కొరియర్ డెలివరీ బాయ్‌గా పనిచేస్తున్నాడు. బుధవారం ఉదయం చేపల చెరువు గట్టుపై పచ్చిగడ్డి కోసేందుకు వెళ్లాడు. గడ్డి కోస్తుండగా కొడవలి సమీపంలో ఉన్న విద్యుత్ తీగలకు తగలడంతో షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి వివాహం కాలేదు. సర్పంచ్ కూనపు రెడ్డి సాయికృష్ణ సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు.

21న ప్రత్యేక లోక్ అదాలత్

ఏలూరు (టూటౌన్): జాతీయ, రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థల ఆదేశాల మేరకు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్మన్ సి.పురుషోత్తంకుమార్ ఆధ్వర్యంలో అక్టోబర్ 21న ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రెవెన్యూ, వాహన ప్రమాదాల కేసుల ప్రత్యేక లోక్ అదాలత్ నిర్వహిస్తున్నామని డీఎల్ఎస్ఏ ఇన్‌చార్జి కార్యదర్శి కేకేవీ బుల్లి కృష్ణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల జరిగిన జాతీయ లోక్ అదాలత్‌లో 65 వాహన ప్రమాద కేసులు రాజీ అయ్యాయని, అలాగే ఈ ప్రత్యేక లోక్ అదాలత్‌లో వాహన ప్రమాద, రెవెన్యూ కేసులు రాజీ చేసుకునేందుకు కక్షిదారులు జిల్లా న్యాయ సేవాధికార సంస్థను సంప్రదించాలని కోరారు. కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కేకేవీ బుల్లి కృష్ణ కోరారు.

అదరహో.. పీఆర్-126

- రైతులకు సిరులు కురిపిస్తున్న వరి వంగడం
- ఎకరానికి 45 నుంచి 50 బస్తాల దిగుబడి
- రూ.1370 పలుకుతున్న 75 కిలోల బస్తా
- గత సీజన్ కంటే పెరిగిన ధర, దిగుబడి
- జిల్లాలో ముమ్మరంగా ఖరీఫ్ వరి కోతలు


మోదుగుగుంటలో పీఆర్.126 రకం వరి చేను యంత్రాలతో మాసూలు చేస్తున్న దృశ్యం


ధాన్యం బస్తాలను లారీలోకి ఎక్కిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్ : ఖరీఫ్ సీజన్‌లో పీఆర్-126 రకం వరి వంగడాన్ని సాగు చేసిన రైతుల మోములో ఆనందాలు వెల్లివిరుస్తున్నాయి. దిగుబడులతో పాటు ధర కూడా బాగుండటంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. తాడేపల్లిగూడెం మండలంలో దాదాపు 24,012 ఎకరాల విస్తీర్ణంలో ఖరీఫ్ సాగు చేపట్టగా, దాదాపు ఏడు వేల ఎకరాల్లో ప్రధానంగా పీఆర్-126 రకం వరి వంగడాన్ని రైతులు సాగు చేశారు. సాధారణ రకాలతో పోల్చుకుంటే 115 నుంచి 120 రోజుల కాల వ్యవధిలో ఈ పంట చేతికొచ్చింది. ప్రకృతి వైపరీత్యాలను తట్టుకోవడంతో పాటు తెగుళ్ల బారి నుంచి గట్టెక్కే స్వభావం ఉంది. దీనికి తోడు ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో వర్షాలు సైతం అంతగా కురవకపోవడం కూడా మెట్ట రైతాంగానికి కలిసొచ్చిన అంశంగా మారింది. ప్రస్తుతం ఈ రకం వరి మాసూళ్లు ముమ్మరంగా సాగుతున్నాయి. ఒక పక్క వాతావరణ శాఖ వర్షాలు పడతాయని హెచ్చరిస్తోంది. దీనికి భిన్నంగా గత రెండు రోజులుగా తాడేపల్లిగూడెం మండలంలో వాతావరణం కూడా అనుకూలించడంతో రైతులు యంత్రాలతో కోతలు ప్రారంభించారు. మెట్ట ప్రాంత గ్రామాల్లో దాదాపు వరి కోతలు సైతం పూర్తి కావచ్చాయి.

అనుకూలించిన వాతావరణం

ఏటా ఖరీఫ్ సీజన్‌లో వర్షాల కారణంగా మెట్ట ప్రాంతంలో వరి చేలలోకి నీరు చేరడం, పంట చేతికొచ్చే సమయంలో వర్షాలు కురవడం, తల బరువెక్కి కంకులు నేలకొరగడం వంటి కారణాలతో దిగుబడులు తగ్గేవి. దీంతో 40 బస్తాల దిగుబడి రావడమే గగనంగా ఉండేది. ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో పీఆర్-126 రకం వరి వంగడం 45 నుంచి 50 బస్తాల దిగుబడి రావడం విశేషం. పచ్చిపైనే మిల్లర్లు 75 కిలోల బస్తాను రూ.1370కు కొనుగోలు చేస్తున్నారు. కోతలు ప్రారంభమైన తొలినాళ్లలో రూ.1390కు సైతం కొనుగోలు చేసినట్లు రైతులు చెబుతున్నారు. అదే గత సీజన్‌లో రూ.1180కు విక్రయించారు. దాదాపు గత ఏడాది ఖరీఫ్ సీజన్‌తో పోల్చుకుంటే ధరలో రూ.190 వరకు వ్యత్యాసం కనిపిస్తోంది. ఈ నేపథ్యంలో రైతుల మోములో ఆనందం వెల్లివిరుస్తోంది.

చేను వద్దే మిల్లర్లు కొంటున్నారు



తక్కువ కాల వ్యవధి కలిగిన పంట కావడంతో ప్రస్తుతం కోతలు ముమ్మరంగా జరుగుతున్నాయి. మిల్లర్లు ఈ రకం వరి ధాన్యాన్ని చేల వద్దే కొనుగోలు చేసి, మిల్లులకు తరలిస్తున్నారు. దీంతో వాతావరణం మారకుండానే చేతికందిన పంట సిరులుగా మారుతోంది. ఎటువంటి ఇబ్బంది లేదు.

– చలంశెట్టి శివ వెంకటేశ్వరరావు, ఎల్.అగ్రహారం, తాడేపల్లిగూడెం మండలం

ధర కూడా బాగుంది



ఈ ఏడాది వర్షాలు అంతగా కురవకపోవడం మెట్ట రైతాంగానికి మేలు చేసింది. దీనికి తోడు పీఆర్-126 రకం వరి వంగడం సాగు చేయడం వల్ల తెగుళ్ల బెడద లేదు. పురుగుల మందుల పిచికారీ ఖర్చులు తగ్గాయి. దిగుబడులు ఆశాజనకంగా ఉన్నాయి. 75 కిలోల బస్తాకు రూ.1370 చొప్పున ధర లభించింది.

– తానింకి సత్యనారాయణ, కౌలు రైతు, మోదుగగుంట, తాడేపల్లిగూడెం మండలం

సాగు విస్తీర్ణం పెరుగుతోంది



మెట్ట ప్రాంతంలో ఖరీఫ్ వరి సీజన్‌లో పీఆర్ - 126 వరి వంగడాన్ని సాగు చేసేందుకు రైతులు ఆసక్తి చూపుతున్నారు. ఏటా ఈ వరి వంగడాన్ని సాగు చేసే రైతుల సంఖ్య పెరుగుతోంది. ఈ ఏడాది వర్షాలు తక్కువగా ఉండటం, తెగుళ్ల సమస్య లేకపోవడంతో పాటు దిగుబడులు కూడా పెరిగాయి.

– ఆర్ఎస్ ప్రసాద్, మండల వ్యవసాయాధికారి, తాడేపల్లిగూడెం

3న పాలిటెక్నిక్‌లో స్పాట్ కౌన్సెలింగ్

పెంటపాడు: తాడేపల్లిగూడెంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో చేరగోరే విద్యార్థులు వచ్చే నెల 3వ తేదీన నిర్వహించే స్పాట్ కౌన్సెలింగ్‌లో పాల్గొనాలని కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.ఫణీంద్రప్రసాద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పాలిసెట్-2023లో ర్యాంక్ వచ్చి ఎక్కడా సీట్లు తీసుకోని అభ్యర్థులతో పాటు, పదోతరగతి పాసైన అభ్యర్థులకు కూడా ఈ కౌన్సెలింగ్‌కు అర్హులన్నారు. కళాశాలలో సివిల్, మెకానికల్ ఇంజనీరింగ్ బ్రాంచ్‌లలో మిగిలిన సీట్ల భర్తీకి ఈ కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నామన్నారు. పలు పరిశ్రమలు, కంపెనీలలో ఉద్యోగ అవకాశాలు మెండుగా ఉండే ఈ బ్రాంచ్‌లలో ఆసక్తి కలిగిన అభ్యర్థులు అక్టోబర్ 3న ఉదయం 10 గంటలకు సంబంధిత ధ్రువపత్రాలతో ఎస్ఐటీ సమీపంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో హాజరుకావాలన్నారు.

పిడుగుపాటు మృతుల కుటుంబాలను ఆదుకుంటాం

- ఒక్కొక్కరికి రూ.4 లక్షల చొప్పున పరిహారం అందిస్తాం
- నూజివీడు ఇన్‌చార్జి సబ్ కలెక్టర్ జీవీవీ సత్యనారాయణ
- పాశ్వానగరంలో మృతుల కుటుంబాలకు పరామర్శ


పాశ్వానగరంలో బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ జీవీవీ సత్యనారాయణ

చింతలపూడి: లింగపాలెం మండలం పాశ్వానగరంలో మంగళవారం పిడుగుపాటుకు గురై మహిళా కూలీలు మృతి చెందిన ఘటనలో బాధిత కుటుంబాలను ప్రభుత్వం అన్నివిధాలా ఆదుకుంటుందని నూజివీడు ఇన్‌చార్జి సబ్ కలెక్టర్ జీవీవీ సత్యనారాయణ చెప్పారు. కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ ఆదేశాల మేరకు బాధిత కుటుంబాలను బుధవారం ఇన్‌చార్జి సబ్ కలెక్టర్ పరామర్శించారు. అలాగే ఈ ఘటనలో తీవ్ర గాయాలపాలై చింతలపూడి ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సొంగా జ్యోత్స్న ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆసుపత్రి వైద్యాధికారులతో మాట్లాడుతూ మెరుగైన చికిత్స అందించాలని ఆదేశించారు. అనంతరం దేవమాత, మనీషా మృతదేహాలకు చింతలపూడి ప్రభుత్వ ఆసుపత్రిలో నిర్వహించిన శవపంచనామా పరిశీలించారు. మృతుల కుటుంబాలకు రూ.4 లక్షల చొప్పున నష్టపరిహారం అందిస్తామని, శవపంచనామ నివేదిక అందిన వెంటనే ఈ మేరకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపుతామన్నారు. అంతేకాక బాధిత కుటుంబాలను ప్రభుత్వం తరపున అన్నివిధాలా ఆదుకుంటామని సబ్ కలెక్టర్ సత్యనారాయణ చెప్పారు. ఆయన వెంట లింగపాలెం మండల వైఎస్సార్ సీపీ నాయకులు ముసునూరి వెంకటేశ్వరరావు, తహసీల్దార్ మురళీకృష్ణ ఉన్నారు.

బాధిత కుటుంబాలకు సాయం

ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్



దెందులూరు: పిడుగు పాటుకు పాశ్వానగరంలో మహిళా కూలీలు మృతి చెందగా, బాధిత కుటుంబాలకు సాయం అందించేందుకు తన వంతు కృషి చేస్తానని ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్ అన్నారు. మృతుల కుటుంబాలను ఆదుకోవడంతో పాటు గాయాలపాలై చింతలపూడి ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మహిళకు మెరుగైన వైద్య సేవలు అందించేలా చర్యలు తీసుకోవాలని బుధవారం కలెక్టర్ ప్రసన్న వెంకటేష్‌ను ఎంపీ ఫోన్‌లో ఆదేశించారు. పిడుగుపాటు వల్ల రెండు కుటుంబాల్లో జరిగిన నష్టాన్ని ఎవరూ తీర్చలేనిదన్నారు. ఈ విషయాన్ని ప్రత్యేక సంఘటనగా తీసుకుని వారికి తన వంతు సాయం అందించేందుకు కృషి చేస్తానని ఎంపీ చెప్పారు.

శాశ్వత లోక్ అదాలత్‌లో తొలి తీర్పు


శాశ్వత లోక్ అదాలత్‌లో తొలి తీర్పు ప్రతిని కక్షిదారునికి అందజేస్తున్న చైర్‌పర్సన్ ఎ.మేరీగ్రేస్ కుమారి

ఏలూరు (టూటౌన్): ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ప్రజా సమస్యల శాశ్వత న్యాయపీఠం ఏలూరులో బుధవారం తొలితీర్పును వెలువరించినట్లు శాశ్వత లోక్ అదాలత్ చైర్‌పర్సన్ ఎ.మేరీ గ్రేస్ కుమారి చెప్పారు. స్థానిక జిల్లా న్యాయసేవా సదన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో తొలి తీర్పు ప్రతిని ఆమె కక్షిదారునికి అందజేశారు. దెందులూరు మండలం గాలాయగూడెం గ్రామానికి చెందిన పర్వతనేని వీర వెంకట వరప్రసాద్ జేసీబీ కొనే నిమిత్తం మాగ్మా ఫిన్ కార్పొరేషన్ బ్యాంకు నుంచి రూ.25 లక్షలు రుణం తీసుకున్నారు. బ్యాంకు సేవలపై అసంతృప్తి చెందిన ఆయన శాశ్వత లోక్‌అదాలత్‌ను ఆశ్రయించారు. దీనిపై విచారణను రెండు నెలల లోపు చేసి వారికి కౌన్సెలింగ్ నిర్వహించి కేసును రాజీ చేయడం జరిగిందని తెలియజేశారు. వినియోగదారులకు పది రకాల సేవలపై లోపం జరిగినట్లయితే శాశ్వత లోక్ అదాలత్‌ను ఆశ్రయించడం ద్వారా డబ్బు, సమయం ఆదా చేసుకోవచ్చునని చైర్‌పర్సన్ మేరీ గ్రేస్ కుమారి తెలిపారు. ఈ విచారణ కార్యక్రమంలో శాశ్వత లోక్ అదాలత్ సభ్యులు కేవీ చంద్రశేఖర్, జి.మోహన్‌కుమార్ పాల్గొన్నారు.

బుట్టాయగూడెంలో కేంద్ర బృందం పర్యటన

- 15వ ఆర్థిక సంఘం నిధుల ఖర్చుపై ఆరా
- సంతృప్తి వ్యక్తం చేసిన అధికారుల బృందం


బుట్టాయగూడెం పంచాయతీ కార్యాలయంలో వివరాలు అడిగి తెలుసుకుంటున్న కేంద్ర బృందం

బుట్టాయగూడెం: గ్రామ పంచాయతీలకు కేంద్ర ప్రభుత్వం విడుదల చేస్తున్న 15వ ఆర్థిక సంఘం నిధులు నిబంధనల మేరకు ఖర్చు చేస్తున్నాయా లేదో పరిశీలించడానికి డిప్యూటీ సెక్రటరీ స్థాయి అధికారి విజయ్ కుమార్ ఆధ్వర్యంలోని కేంద్ర బృందం బుధవారం బుట్టాయగూడెం గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని సందర్శించింది. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ రిజర్వేషన్స్, ఫైనాన్స్ స్టేట్‌మెంట్స్, క్యాష్ బుక్ వివరాలతో పాటు రాష్ట్ర ప్రభుత్వ ఎలక్ట్రిసిటీ బిల్స్‌కు సంబంధించి 15వ ఆర్థిక సంఘ నిధుల వినియోగంపై ఆరా తీశారు. అలాగే బుట్టాయగూడెం పంచాయతీ పరిధిలో ఎలక్ట్రికల్ మీటర్లను ప్రభుత్వ పరంగా ఎక్కడెక్కడ ఏర్పాటు చేశారనే విషయాన్ని కూడా పరిశీలించారు. ఈ సందర్భంగా కేంద్ర బృందానికి జిల్లా పంచాయతీ అధికారి తూతిక శ్రీనివాస విశ్వనాథ్ పూర్తి స్థాయి వివరాలు, రికార్డులు సమర్పించారు. వీటిని పరిశీలించిన బృందం సంతృప్తిని వ్యక్తం చేసింది. అలాగే కరెంట్ చార్జీలకు సంబంధించిన వివరాలను కూడా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సీఈఓ కె.రవికుమార్, కృష్ణా జిల్లా సీఈఓ జ్యోతి బసు, ఎన్టీఆర్ జిల్లా డీపీఓ గాంధీ, పంచాయతీరాజ్ కమిషనర్ కార్యాలయ చీఫ్ అకౌంట్స్ ఆఫీసర్ జి.వీరాంజనేయులు, సర్పంచ్ తెల్లం వెంకాయమ్మ, డీఎల్‌పీఓ రజావుల్లా, ఈఓపీఆర్‌డీ ఎం.శ్రీహరి, కార్యదర్శి కె.కిరణ్ పాల్గొన్నారు.

విదేశాల్లో చదువుపై ట్రిపుల్ ఐటీతో ఒప్పందం


ఒప్పంద పత్రాన్ని చూపిస్తున్న చాడ జగదీష్‌రెడ్డి, ఆచార్య జీవీఆర్ శ్రీనివాసరావు

నూజివీడు: ట్రిపుల్ ఐటీ విద్యార్థులు విదేశాలకు వెళ్లి చదువుకోవడానికి ఇప్పటి నుంచే అవగాహన కలిగి ఉండాలనే లక్ష్యంతో నూజివీడు ట్రిపుల్‌ఐటీ హైదరాబాద్‌కు చెందిన డీజీరేఖ కన్సెల్టింగ్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీతో ఒప్పందం (ఎంఓయూ) కుదుర్చుకుంది. దీనిలో భాగంగా డీజీరేఖ కంపెనీ డైరెక్టర్ చాడ జగదీష్‌రెడ్డి, ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ ఆచార్య జీవీఆర్ శ్రీనివాసరావు ఈ ఒప్పందంపై సంతకాలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విదేశాల్లో చదువుకోవాలనుకునే విద్యార్థుల కోసం మూడేళ్ల పాటు ఉచితంగా జీఆర్ఈ, టోఫెల్, ఐఈఎల్‌టీఎస్‌లకు సిద్ధమయ్యేలా ప్రత్యేక తర్ఫీదును డీజీరేఖ కంపెనీ ఇస్తుందన్నారు. దీని వల్ల విదేశాల్లో ఉన్న యూనివర్సిటీలు, అక్కడ ఉన్న వాటిల్లో నాణ్యమైన విద్యనందించేవి ఏవీ, వాటిల్లో ఎలా అడ్మిషన్లు పొందాలి తదితర అంశాలపైనా అవగాహన కల్పిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో రీసెర్చ్ హెడ్ ఆచార్య జీ మోహన్‌రెడ్డి, ఏవో ప్రదీప్, డీన్ అకడమిక్స్ లక్ష్మణరావు, హైయ్యర్ ఎడ్యుకేషన్ సెల్ ఇన్‌చార్జి ఎ.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

హత్యాయత్నం కేసులో ఇద్దరికి రిమాండ్


నిందితులను పట్టుకున్న ఆగిరిపల్లి పోలీసులు

నూజివీడు (ఆగిరిపల్లి): హత్యాయత్నం కేసులో ఇద్దరు నిందితులను అరెస్టు చేసి కోర్టులో హాజరుపరచగా రిమాండ్ విధించినట్లు ఎస్సై నంబూరు చంటిబాబు చెప్పారు. ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఆగిరిపల్లి మండలం ఈదరలో గురజాల సంగీతరావుతో అదే గ్రామానికి చెందిన దేవరపల్లి రమేష్, దేవరపల్లి నవీన్‌లు ఈ నెల 24వ తేదీ రాత్రి రూ.4వేల అప్పు విషయమై గొడవపడి కత్తితో సంగీతరావును పొడిచి పరారయ్యారు. తీవ్ర గాయాలతో ఉన్న సంగీతరావును విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, అక్కడ చికిత్స పొందుతున్నాడు. ఈ ఘటనపై ఎస్సై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఈ కేసులో పరారీలో ఉన్న ఇద్దరు నిందితులను అరెస్టు చేసి కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి నిందితులిద్దరికీ రిమాండ్ విధించారు.

సరోగసీతో గేదె దూడలు

- ఎస్వీ యూనివర్సిటీ పరిశోధనా సంచాలకులు కె.సర్జన్ రెడ్డి



మాట్లాడుతున్న ఎస్వీ యూనివర్సిటీ పరిశోధనా సంచాలకులు కె.సర్జన్‌రెడ్డి

తాడేపల్లిగూడెం: సరోగసీతో గేదె దూడలను పుట్టించే ప్రక్రియను వెంకట్రామన్నగూడెంలోని గేదెల పరిశోధనా స్థానంలో ప్రారంభిస్తామని శ్రీవెంకటేశ్వర యూనివర్సిటీ పశుసంవర్ధక విశ్వవిద్యాలయ పరిశోధనా సంచాలకులు డాక్టర్ కె.సర్జన్‌రెడ్డి వెల్లడించారు. వెంకట్రామన్నగూడెంలోని గేదెల పరిశోధనా స్థానంలో 'పశువైద్యవృత్తిలో నైపుణ్యాల మెరుగుదల' అనే అంశంపై బుధవారం ప్రారంభమైన శిక్షణా కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. పశువైద్యంలో గ్రామీణ యువతపాత్ర చాలా అవసరమన్నారు. తద్వారా పశుసంపద పెంచవచ్చన్నారు. రాష్ట్రంలో ఆర్థికాభివృద్ధి వ్యవసాయం, పశుపోషణ, మత్స్య పరిశ్రమలపై ఆధారపడి ఉందన్నారు. జగనన్న పాలవెల్లువ ద్వారా పాడిరైతులను ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుంటోందన్నారు. గ్రామీణ యువతకు పశువైద్యం అందించేందుకు నిరంతర శిక్షణా కార్యక్రమాలు కొనసాగిస్తుందన్నారు. గుంటూరు శాస్త్రవేత్తల సాంకేతిక సహకారంతో వెంకట్రామన్నగూడెంలో పిండమార్పిడి ద్వారా దూడల జననం ప్రక్రియను సరోగసీ ద్వారా చేపడతామన్నారు. తర్వాత ప్రక్రియను గ్రామీణ ప్రాంతాలకు విస్తరిస్తామన్నారు. గేదెల పరిశోధనా స్థానంలో పశుగ్రాసాల అభివృద్ధి జరుగుతుందన్నారు. 18 నుంచి 20 శాతం మాంసకృత్తులను ఇచ్చే పశుగ్రాసాల అభివృద్ధి చేసి రైతులకు అందుబాటులోకి తెస్తామన్నారు. శిక్షణా కార్యక్రమాలను యువత సద్వినియోగం చేసుకుని స్వయంసమృద్ధిని సాధించాలన్నారు. గేదెల పరిశోధనా స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ కె.ఆనందరావు, శాస్త్రవేత్తలు డాక్టర్ రవికుమార్, డాక్టర్ ఎ.తేజా పాల్గొన్నారు.

చెరువులో పడి వృద్ధురాలు మృతి


వరలక్ష్మి మృతదేహం

ద్వారకాతిరుమల: ఐఎస్ రాఘవాపురం శివారులోని రాతి చెరువులో పడి బుధవారం ఓ వృద్ధురాలు మృతి చెందింది. వివరాలిలా ఉన్నాయి. కొయ్యలగూడెం మండలం గంగవరానికి చెందిన చిన్నంశెట్టి వరలక్ష్మి (65)కి మతిస్థిమితం సరిగ్గా లేదు. గత 15 ఏళ్లుగా ఆమె మందులు వాడుతోంది. ఇదిలా ఉంటే మండలంలోని జి.కొత్తపల్లిలో ఉన్న తమ్ముడి ఇంటికి వెళ్లేందుకు ఉదయం కొయ్యలగూడెంలో ఆర్టీసీ బస్సు ఎక్కిన వరలక్ష్మి, రాఘవాపురం శివారులో దిగిపోయింది. నడుచుకుంటూ వెళుతూ చెరువులో పడి నీటమునిగి మృతి చెందింది. అటుగా వెళుతున్న స్థానికులు నీటిలో తేలుతున్న మృతదేహాన్ని చూసి, పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై టి.సుధీర్ సిబ్బందితో కలసి ఘటనా స్థలానికి చేరుకుని, మృతదేహాన్ని బయటకు తీయించారు. అయితే మతిస్థిమితం సరిగ్గా లేకే వరలక్ష్మి చెరువులో పడి మృతి చెందిందని, ఆమె భర్త దుర్గారావు సైతం తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్నట్టు కుటుంబ సభ్యులు తెలిపారు. దీనిపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

మహిళ ప్రాణాలు కాపాడిన పోలీసులు



ఎస్పీ మేరీ ప్రశాంతి చేతులమీదుగా రివార్డ్ అందుకుంటున్న కానిస్టేబుల్ రమేష్, పోలీస్ సిబ్బందిని అభినందిస్తున్న ఉన్నతాధికారులు

- రైల్వే ట్రాక్‌పై భార్యను బ్లేడ్‌తో బెదిరించిన భర్త
- ప్రాణాలకు తెగించి మహిళను కాపాడిన వైనం
- అభినందించిన ఏలూరు ఎస్పీ మేరీ ప్రశాంతి

ఏలూరు టౌన్: ఏలూరు శివారు వట్లూరు ప్రాంతంలో రైల్వే ట్రాక్‌పై ఒక వ్యక్తి తన భార్యను బ్లేడ్‌తో దాడి చేస్తానంటూ బెదిరిస్తూ రైల్వే ట్రాక్‌పై బలవంతంగా తీసుకువెళుతుండగా ఏలూరు త్రీటౌన్ పోలీసులు ప్రాణాలకు తెగించి భర్త బారి నుంచి భార్యను రక్షించారు. ఒకపక్క రైలు వస్తుండగా, మరోవైపు భర్త చేతిలో నుంచి భార్యను కాపాడేందుకు పోలీస్ సిబ్బంది ఎంతో సాహసం చేశారు. ఈ సంఘటన ఆలస్యంగా వెలుగులోకి రాగా ఏలూరు జిల్లా ఎస్పీ డీ.మేరీ ప్రశాంతి ఏలూరు త్రీటౌన్ కానిస్టేబుల్ కె.రమేష్, హెడ్ కానిస్టేబుల్ కె.ఏడుకొండలు, మరో హెడ్ కానిస్టేబుల్ ఐ.శ్రీనివాసరావు ధైర్యసాహసాలను అభినందిస్తూ వారికి ఏలూరు జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో బుధవారం నగదు రివార్డులు అందజేశారు. ముగ్గురు రైల్వే ట్రాక్‌పై పరుగులు పెడుతూ వెళ్లి చాకచక్యంగా భర్త చేతుల్లోంచి భార్యను విడిపించటంతోపాటు, రైలు ప్రమాదం చోటుచేసుకోకుండా రక్షించడాన్ని అభినందించారు. ఈ కార్యక్రమంలో ఏలూరు డీఎస్పీ ఈ.శ్రీనివాసులు, ఎస్బీ సీఐ ఎం.సుబ్బారావు, ఏలూరు త్రీటౌన్ సీఐ కోమాకుల శివాజీ, సిబ్బంది ఉన్నారు.

అణగారిన వర్గాల అభ్యున్నతే లక్ష్యంగా జగన్ పాలన


భీమవరంలో విలేకరులతో మాట్లాడుతున్న మంగరాజు

సాక్షి, భీమవరం: అణగారిన వర్గాల అభ్యున్నతే లక్ష్యంగా, అంబేడ్కర్ ఆశయ సాధన దిశగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన చేస్తున్నారని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు, ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మోనటరింగ్ కమిటీ జిల్లా సభ్యుడు చీకటిమిల్లి మంగరాజు అన్నారు. బుధవారం భీమవరంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో వైఎస్ జగన్ అధికారంలోనికి వచ్చిన తరువాత ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, కాపులకు పెద్దపీట వేశారని కొనియాడారు. కేంద్రంలో మహిళలకు 33 శాతం రిజర్వేషన్స్ బిల్లును ఆమోదించగా, రాష్ట్రంలో వైఎస్ జగన్ ప్రభుత్వం రెండున్నరేళ్ల క్రితమే మహిళలకు 50 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తోందన్నారు. నవంబర్‌లో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహావిష్కరణలో దళిత, ప్రజాసంఘాల నాయకులకు భాగస్వామ్యం కల్పించాలని కోరారు. కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ చేస్తూ సీఎం తీసుకున్న నిర్ణయానికి ధన్యవాదాలు తెలిపారు. వి.సునీల్, మానుకొండ నాగేశ్వరరావు, కె.రాజారావు పాల్గొన్నారు.

హత్య కేసులో నిందితుడి అరెస్ట్

కుకునూరు: మండలంలోని అల్లిగూడెం గ్రామంలో జరిగిన గొర్ల పెరంబాబు హత్య కేసులో సురేష్ అనే వ్యక్తిని బుధవారం కుక్కునూరు సీఐ శ్రీనివాస్ అరెస్టు చేశారు. నిందితుడిని కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించారు. వివాహేతర సంబంధం నేపథ్యంలో పెరంబాబును అతని భార్య, సురేష్ కలిసి హత్య చేశారని, ఈ కేసులో పోలీసులు నిష్పక్షపాతంగా విచారణ చేయించాలని పెరంబాబు తల్లిదండ్రులు ఎస్పీని కలిసి విన్నవించారు. దీంతో బుధవారం సురేష్‌ను అరెస్ట్ చేసినట్లు తెలుస్తోంది.

క్లుప్తంగా

కొచ్చెర్లకోట గణనాథుడి లడ్డూ పాట రూ. 1.08 లక్షలు



తణుకు కొచ్చెర్లకోట వారి వీధి గణనాథుడి పెద్ద లడ్డూను పాడుకున్న భక్తులు

తణుకు అర్బన్: తణుకు కొచ్చెర్లకోట వారి వీధిలో శ్రీలక్ష్మి గణపతి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన గణపతి నవరాత్రి మహోత్సవాల ముగింపు కార్యక్రమంలో భాగంగా తొమ్మిది రోజులపాటు స్వామివారి వద్ద ఉంచిన లడ్డూ ప్రసాదాన్ని బుధవారం వేలంపాట నిర్వహించారు. పెద్ద లడ్డూను తణుకుకు చెందిన సంభవ్ జ్యూయలర్స్ యజమాని బండారు ఆనంద్ రూ. 1,08,009లకు, చిన్న లడ్డును రిషిక్ మొబైల్స్ యాజమాన్యం రూ. 26వేలకు, వినాయకుని వెండి ప్రతిమను తణుకుకు చెందిన బంగారం రూ. 11,009లకు కైవసం చేసుకున్నారు.

రూ.37.64 లక్షల లాభాల్లో నవాబుపాలెం సొసైటీ

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని నవాబుపాలెం సొసైటీ మహాజన సభ బుధవారం సొసైటీ ఆవరణలో నిర్వహించారు. ఈ సందర్భంగా 2022–23 ఆర్థిక సంవత్సరానికి గాను ఆడిట్ రిపోర్టును ప్రవేశపెట్టారు. 37లక్షల 64వేల 961 రూపాయలు మేర లాభం వచ్చిందని, 2022–23వ సంవత్సరానికి ఎనిమిది శాతం డివిడెంట్‌గా సభ్యులకు అందజేయనున్నట్టు సొసైటీ సీఈవో పీవీవీ.సత్యనారాయణ ప్రకటించారు. ఈ సమావేశంలో సభ్యులు చిట్టూరి భాస్కరరావు, మద్దుకూరి మెహెర్‌ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సమష్టి కృషితో స్వచ్ఛ పట్టణం

తణుకు అర్బన్: స్వచ్ఛ పట్టణంగా తణుకును తీర్చిదిద్దేందుకు ప్రజలు సహకరించాలని మున్సిపల్ కమిషనర్ కేటీ సుధాకర్ అన్నారు. కేంద్ర పట్టణ, గృహ నిర్మాణ మంత్రిత్వ శాఖ, ఆంధ్రప్రదేశ్ పురపాలక శాఖ సంయుక్త ఆధ్వర్యంలో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇండియన్ స్వచ్ఛత లీగ్ (సీజన్ 2)లో స్వచ్ఛత హీ సేవ కార్యక్రమంలో భాగంగా బుధవారం తణుకు మున్సిపల్ కార్యాలయంనుంచి జెడ్పీ బాయ్స్ హైస్కూల్ వరకు మారథాన్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ ఉద్యోగులు, సిబ్బంది, ప్రగతి కళాశాల విద్యార్థులు, జెడ్పీ బాయ్స్ హైస్కూలు విద్యార్థులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ పరికరాలను వినియోగించాలి

తాడేపల్లిగూడెం రూరల్: పామాయిల్ చెట్ల ఆకులు నరికే సమయంలో ప్లాస్టిక్ పరికరాలను వినియోగించాలని విద్యుత్‌శాఖ ఈఈ ఎస్.వెంకటేశ్వరరావు రైతులకు సూచించారు. ఉద్యాన శాఖ, ఏపీఈపీడీసీఎల్ సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం మండలంలోని పట్టెంపాలెం గ్రామంలో పామాయిల్ రైతులతో విద్యుత్ భద్రత అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఈఈ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ పామాయిల్ తోటల మీదుగా విద్యుత్ లైన్లు ఉంటే లైన్ మెన్‌ను సంప్రదించి లైన్ క్లియరెన్స్ తీసుకోవాలన్నారు. విద్యుత్ అంతరాయం తలెత్తితే 1912కు ఫోన్ చేసి, తెలియజేయవచ్చన్నారు. ఈ సూచలను తప్పక పాటించి, విద్యుత్‌ప్రమాదాలు జరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఈఈ వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ సమావేశంలో పామాయిల్ రైతులు, విద్యుత్‌శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

అత్తిలిలో సువార్త ప్రార్థనా మందిరం ప్రారంభం

అత్తిలి: వైఎస్సార్‌సీపీ జిల్లా క్రిస్టియన్ మైనార్టీ సెల్ నాయకులు పి సంపదరావు నూతనంగా నిర్మించిన అగాపే సంపూర్ణ సువార్త సంఘ ప్రార్థనా మందిరాన్ని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీసెల్ అధ్యక్షుడు మేడిది జాన్సన్ బుధవారం ప్రారంభించారు. కార్యక్రమంలో అత్తిలి ఏఎంసీ చైర్మన్ బుద్దరాతి భరణీ ప్రసాద్, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పైబోయిన సత్యనారాయణ, జిల్లా క్రిస్టియన్ మైనార్టీ సెల్ నాయకులు గుర్రం బెనహర్, మెడవంకల రత్నరాజు, వైసీపీ అత్తిలి, తణుకు మండల ఎస్సీసెల్ అధ్యక్షులు కోరుకొల్లు వెంకట్రావు, జంగం ఆనందకుమార్, ఎస్సీసెల్ నాయకులు నేలపాటి సుబ్బయ్య, సబ్బితి రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

డీఈవోను కలిసిన ప్రధానోపాధ్యాయ సంఘం నేతలు

తణుకు: ప్రధానోపాధ్యాయులు సమస్యలు పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రధానోపాధ్యాయుల సంఘం నేతలు జిల్లా విద్యాశాఖ అధికారి ఆర్.వెంకటరమణను కోరారు. ఈ మేరకు బుధవారం డీవోను కలిసిన సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు ఎం.నాగ శ్రీమన్నారాయణ, జిల్లా అధ్యక్షుడు నేలపాటి వెంకటరమణ, జిల్లా ప్రధాన కార్యదర్శి నల్లజర్ల వెంకటరాంప్రసాద్‌లు కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. జూన్ 18న కౌన్సిలింగ్ ద్వారా బదిలీపై ఎంఈవో–2గా వచ్చిన వారికి జీతాలు మంజూరు చేయాలని, 2021,2022 విద్యాసంవత్సరంలో మెజార్టీ స్కూల్స్‌కు స్కూలు గ్రాంట్ మంజూరు చేయాలని, ఎంఈవో–2 పొజిషన్ ఐడీలు క్రియేట్ చేయించి అరియర్స్‌తో సహా జీతాలు చెల్లించాలని విజ్ఞప్తి చేశారు.

అమ్మకు తగ్గిన కోత..

- తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రిలో తగ్గిన సిజేరియన్‌లు
- సాధారణ ప్రసవాలకే ప్రోత్సహిస్తున్న వైనం
- ఆదర్శవంతంగా తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రి



తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రి

తణుకు అర్బన్ : ప్రసవానంతరం బాలింత బతికితే అది పునర్జన్మగా భావించే రోజుల నుంచి సూది మందు వేసుకున్నంత సుఖంగా గర్భిణులకు సులువుగాను, సిజేరియన్ విధానంలోను ప్రసవం చేయించి బిడ్డను సురక్షితంగా బయటకు తీస్తున్నారు వైద్యులు, నర్సులు. మారుతున్న కాలానికి అనుగుణంగా వైద్యం ఎంతో నాణ్యంగా, అధునాతన పరికరాలు అందుబాటులోకి వచ్చినప్పటికీ ఇప్పటికీ కొన్ని ఆస్పత్రుల్లో కాసులకోసం కక్కుర్తి పడుతూ సిజేరియన్‌కే ప్రాధాన్యతనిస్తున్నాయి. ఈ క్రమంలో సాధారణ ప్రసవాలు అయ్యే అవకాశం ఉన్నప్పటికీ కొన్ని ప్రైవేటు ఆస్పత్రుల్లో డబ్బుల కోసం ఆరాటంతో సిజేరియన్‌లు చేసి బిడ్డను బయటకు తీస్తున్న పరిస్థితులు నెలకొన్నాయి. ఇటువంటి పరిస్థితుల్లో తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రి వైద్యవర్గాలు అందిస్తున్న సేవలు అజరామజరంగా నిలుస్తున్నాయి.

40 శాతానికి తగ్గిన సిజేరియన్‌లు

తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రిలో ఇటీవల కాలంలో వైద్యులు, నర్సులు, సిబ్బంది కృషితో వైద్యశాఖ విధిస్తున్న లక్ష్యాలకు చేరువవుతుంది. ప్రభుత్వ ఆదేశాల మేరకు 30 శాతంలోపు మాత్రమే సిజేరియన్ ప్రసవాలు నిర్వహించాల్సి ఉండగా ప్రస్తుతం ప్రైవేటు ఆస్పత్రుల్లో 90 శాతం సిజేరియన్ ప్రసవాలకే వైద్యులు చొరవ చూపిస్తుండడం విశేషం. ఈ తరుణంలో తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రి వైద్యవర్గాలు సిజేరియన్స్ 40 శాతంలోపుగా ఉండే విధంగా వైద్యసేవలు అందిస్తున్నారు. రానున్న రోజుల్లో వైద్యశాఖ లక్ష్యానికి తగ్గట్లుగా సాధారణ ప్రసవాలు చేయనున్నట్లు చెబుతున్నారు.

సిజేరియన్‌లు చేసే పరిస్థితులు ఇవే...

గర్భిణి వివిధ రకాల అనారోగ్య సమస్యలతో నిండి ఉండడమే అధికశాతం సిజేరియన్‌లు చేసే పరిస్థితి వస్తుందని తెలుస్తోంది. ముఖ్యంగా బీపీ, సుగర్, హైరిస్క్ కేసుల్లో ఎక్కువ శాతం సిజేరియన్ చేసి బిడ్డను బయటకు తీసే పరిస్థితి ఉంటుందని, గర్భంలో బిడ్డ ఎదురు కాళ్లతో ఉన్న సందర్భాల్లోను, అంతే కాకుండా గర్భిణి ఎత్తు 135 సెంటీమీటర్ల కంటే తక్కువగా ఉంటే తప్పనిసరిగా సిజేరియన్ పడే అవకాశం ఉంటుందని, గర్భిణుల్లో మొదటి కాన్పు సిజేరియన్ అయితే రెండో కాన్పులో కూడా 90 శాతం సిజేరియన్ పడే అవకాశం ఉంటుందని వైద్యులు చెబుతున్నారు. దీంతోపాటు మంచి రోజు చూసి సిజేరియన్‌లు చేయించుకునే పరిస్థితుల్లో సైతం గర్భిణులు, వారి బంధువులు ఉన్నట్లుగా వైద్యులు చెబుతున్నారు.

తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రిలో ప్రసవాలు ఇలా..

	నార్మల్ డెలివరీలు	సిజేరియన్ డెలివరీలు
జూలై	109	105
ఆగస్టు	147	130
సెప్టెంబరు	143	119

నార్మల్ డెలివరీలకే ప్రాధాన్యతనిస్తున్నాం



తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రికి వచ్చే గర్భిణులందరిని ముందుగా మ్యాటీ వార్డులో చేర్చి చివరి నిమిషం వరకు నార్మల్ డెలివరీ కోసం ప్రయత్నం చేస్తున్నాం. కొందరు గర్భిణుల్లో వివిధ రకాల ఆరోగ్య సమస్యలతో పాటు హైరిస్క్ కేసులు తప్పించి మిగిలినవన్ని నార్మల్ డెలివరీలుగానే చేస్తున్నాం. ఈ క్రమంలో గర్భిణులు, వారి సంరక్షకులు కూడా మాకు సహకరించాల్సి ఉంటుంది.

– డాక్టర్ వెలగల అరుణ, తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రి ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్

ప్రసవాల్లో తణుకు ప్రభుత్వ ఆస్పత్రి వైద్యుల సేవలు భేష్



ప్రైవేటు ఆస్పత్రుల్లో ప్రసవాలకు సంబంధించి ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా అధిక శాతం సిజేరియన్‌లు చేస్తుండడం బాధాకరం. 80 శాతానికి పైగా సిజేరియన్‌లు జరుగుతుండడం శోచనీయం. ఇటువంటి తరుణంలో తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రిలో ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్ డాక్టర్ అరుణ కృషితో సిజేరియన్ డెలివరీల శాతం తగ్గి నార్మల్ డెలివరీల శాతం పెరగడం శుభపరిణామం.

– డాక్టర్ దాట్ల సుందరరామరాజు, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ గౌరవ అధ్యక్షుడు

రేపు కృష్ణయ్యపాలెంలో గడప గడపకు మన ప్రభుత్వం

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని కృష్ణయ్యపాలెం గ్రామంలో గురువారం సాయంత్రం 5 గంటలకు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్టు మంత్రి క్యాంపు కార్యాలయ ప్రతినిధులు తెలిపారు. బుధవారం ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు హాజరు కావాలని కోరారు.

క్రీడాకారులకు అభినందనలు



మహాలక్ష్మిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

పెంటపాడు: విద్యార్థులలో క్రీడాశక్తిని పెంపొందించేందుకు వీలుగా స్కూల్ ఫెడరేషన్ క్రీడాపోటీలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని గూడెం డాక్టర్ కోడే వెంకట్రావు మున్సిపల్ హైస్కూల్ హెచ్‌ఎం కె. తబిత పేర్కొన్నారు. ఇటీవల నియోజకవర్గ స్థాయిలో గూడెం జెడ్పీ హైస్కూల్లో నిర్వహించిన క్రీడాపోటీలలో కడకట్ల హైస్కూలుకు చెందిన పలువురు విద్యార్థులు ప్రతిభ కనపరచినట్లు తెలిపారు. యోగాలో జిల్లా స్థాయి నుంచి రాష్ట్ర స్థాయికి జి. మహాలక్ష్మిశ్రీవాణి ఎంపికై నట్లు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థి వాణిని ప్రత్యేకంగా ఉపాధ్యాయులు అభినందనించారు.

బొజ్జ గణపయ్యకు వీడ్కోలు



తణుకు రాష్ట్రపతి రోడ్డులో ఊరేగుతున్న భారీ గణనాథుడు

పుర వీధుల్లో ఊరేగిన భారీ గణనాథుడు

తణుకు అర్బన్: గణపతి నవరాత్రి మహోత్సవాల ముగింపు కార్యక్రమంలో భాగంగా తణుకులో గణనాథుడి నిమజ్జనోత్సవ సందడి నెలకొంది. 9వ రోజు కావడంతో బుధవారం తణుకు రాష్ట్రపతి రోడ్డులోని వరసిద్ధి వినాయకస్వామి ఆలయం, తణుకు కొచ్చెర్లకోట వారి వీధిలోని 18 అడుగుల భారీ గణనాథుడితో పాటు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మండపాల్లోని గణనాథుడి విగ్రహాలను భారీ ఊరేగింపు, మేళతాళాలు, బ్యాండుమేళం, తీన్‌మార్ డప్పులు, శక్తి వేషాలు, విచిత్ర వేషధారణల మధ్య బాణాసంచా కాల్పులతో స్వామివారిని పట్టణ వీధుల్లో ఊరేగించి గోస్తనీ కాలువలో నిమజ్జనం చేశారు. శ్రీలక్ష్మిగణపతి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో కొచ్చెర్లకోట వారి వీధిలో తొమ్మిది రోజులపాటు పూజలందుకున్న భారీ గణనాథుడిని ప్రత్యేకంగా ముస్తాబు చేసిన వాహనంలో క్రేన్ సాయంతో ఎక్కించి అదే క్రేన్ సాయంతో పెద్ద వంతెన పైనుంచి గోస్తనీ కాలువలో నిమజ్జనం చేశారు. భక్తులు వేలాదిగా ఊరేగింపులో పాల్గొని తీర్థప్రసాదములు స్వీకరించారు.

ఘనంగా గణపతి ఊరేగింపు

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలోని గణపతి నవరాత్రి మహోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. 12వ వార్డు పాతూరులో బుధవారం సాయంత్రం గణపతి స్వామివారిని తీన్‌మార్ డప్పులతో, బాణాసంచాలతో ఘనంగా ఊరేగించారు. అనంతరం శివాలయం వద్ద ఏలూరు కాలువలో స్వామివారిని నిమజ్జనం చేశారు. పాతూరు సభ్యులు శ్రీరంగం అంజిబాబు, దాట్ల జగన్నాథరాజు, పాతూరు యూత్ సభ్యులు పాల్గొన్నారు.



పాతూరు 12వ వార్డులో ఊరేగింపులో పాల్గొన్న విద్యార్థులు

ఘనంగా గణపతి నిమజ్జనం

అత్తిలి: గణపతి నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా అత్తిలి పడవల రేవులో వినాయకస్వామి ఆలయం వద్ద నెలకొల్పిన గణపతి ప్రతిమను బుధవారం ఊరేగించారు. పుష్పాలతో అలంకరించిన వాహనంపై స్వామివారి ప్రతిమను ఉంచి, మేళతాళాలతో గ్రామంలో ఊరేగించారు. అనంతరం అత్తిలి కాలువలో గణపతి ప్రతిమను నిమజ్జనం చేశారు. ఉత్సాహంగా యువత, చిన్నారులు పాల్గొన్నారు.



అత్తిలిలో గణపతి ప్రతిమను ఊరేగిస్తున్న దృశ్యం

నిరుద్యోగ యువతకు ఉపాధి



శాసన మండలిలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ వంకా రవీంద్రనాథ్

తణుకు టౌన్: కేంద్ర ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన పీఎం విశ్వకర్మయోజన ద్వారా రాష్ట్రంలోని నిరుద్యోగ యువతకు, చేతివృత్తుల వారికి ఉపాధి అవకాశాలు పెరుగుతాయని దీనికి రాష్ట్రంలో ముమ్మరంగా ప్రచారం కల్పించాలని ఉమ్మడి జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ వంకా రవీంద్రనాథ్ శాసన మండలిలో ప్రభుత్వానికి సూచించినట్లు తెలిపారు. గత ఐదు రోజులుగా జరుగుతున్న శాసన సభ, శాసన మండలి సమావేశాలలో ఆయన పాల్గొని మూడు రోజుల పాటు తన వాణిని వినిపించినట్లు తెలిపారు. పీఎం విశ్వకర్మ యోజన పథకం ద్వారా నిరుద్యోగ యువతకు ఎటువంటి తనఖా లేకుండా రూ. 3 లక్షల వరకూ రూ. 5 శాతం వడ్డీకే రుణం లభిస్తుందని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం ఈపథకం కోసం గ్రామ స్థాయి వరకూ ప్రచారం చేసేందుకు ఏర్పాట్లు చేయాలని కోరినట్లు తెలిపారు. దేవాలయ పురోభివృద్ధికి దేవాదాయ అర్చకులకు ఎంతగానో కృషి చేశారన్నారు. ఉచిత అన్నదాన కార్యక్రమాన్ని రాత్రి 7 గంటల వరకూ కొనసాగించాలని విజ్ఞప్తి చేశామన్నారు. విజయవాడలో శిథిలావస్థకు చేరిన ఈఎస్ఐ ఆపుపత్రి కేంద్ర కార్పొరేషన్‌కు ఇవ్వాలని ఇలా చేస్తే కేంద్ర కార్పొరేషన్ నూతన అత్యాధునిక భవనాలను నిర్మించి అందులో అన్ని విభాగాల స్పెషలిస్ట్ వైద్యులను నియమిస్తుందన్నారు. నిర్వహణ కూడా కార్పొరేషన్ చేయడం వలన రాష్ట్ర ప్రభుత్వానికి భారం తగ్గుతుందన్నారు.

అరుణాచలం, కంచికి ఆర్టీసీ ప్రత్యేక బస్సు



తణుకు ఆర్టీసీ డిపో నుంచి అరుణాచలం బయలుదేరిన ఆర్టీసీ బస్సు

తణుకు అర్బన్: తణుకు ఆర్టీసీ డిపో నుంచి పుణ్యక్షేత్రాల దర్శనార్థం భక్తుల సౌకర్యార్థం అరుణాచలం –కంచికి బుధవారం ప్రత్యేక బస్సును పంపినట్లు డిపో మేనేజరు పీఎస్‌వీఎం సత్యనారాయణమూర్తి తెలిపారు. 28న శ్రీకాళహస్తి, కాణిపాకం, శ్రీపురం పుణ్యక్షేత్రాలను దర్శించుకుని 29న పౌర్ణమి రోజు అరుణాచలం గిరిప్రదక్షిణ చేసుకుని రాత్రికి కంచి చేరుకుంటారని, 30న కంచిలోని ఆలయాల సందర్శన అనంతరం బయలుదేరి వచ్చేనెల 1వతేదీన తణుకు చేరుకుంటారని వివరించారు. తిరిగి అక్టోబరు 27న బయలుదేరే బస్సులో వివరాలకు 94404 19144 నంబరులోను, రిజర్వేషన్ కొరకు 73829 00132 నంబరులో సంప్రదించాలని కోరారు.

చిరుధాన్యాలతో ఆరోగ్యం



పైడిపర్రులో గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పిస్తున్న అధికారులు



తాడేపల్లిగూడెం మండలం ఆరుగొలను అంగన్‌వాడీ కేంద్రంలో పోషకాహార మాసోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

తణుకు: తల్లిబిడ్డ సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలంటే పోషకాహారం తప్పనిసరి అని తణుకు ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి ప్రమోదినికుమారి అన్నారు. బుధవారం పైడిపర్రులో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పౌష్టికాహార వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. సెక్టారు సూపర్‌వైజర్ ఎం.అరుణకుమారి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పుట్టే ప్రతి బిడ్డ సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలన్నదే ప్రభుత్వ ధ్యేయమని అన్నారు. వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకం ద్వారా అందించే ఆహారం గర్భిణులు, బాలింతలు, చిన్నారులు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మహిళా సంరక్షణ కార్యదర్శులు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పౌష్టికాహార పదార్థాలను క్రమం తప్పకుండా తీసుకోవాలి

అత్తిలి: అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలకు అందజేసే పౌష్టికాహార పదార్థాలను క్రమం తప్పకుండా తీసుకోవాలని ఐసీడీఎస్ తణుకు ప్రాజెక్టు సీడీపీఓ ప్రమోదకుమారి అన్నారు. పోషకాహార మాసోత్సవాల్లో భాగంగా అత్తిలి మండలం తిరుపతిపురం గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రాల ఆధ్వర్యంలో బుధవారం పౌష్టికాహారంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ లీలామణికంఠ, వైఎస్సార్‌సీపీ నాయకులు పంపన బుజ్జి, తోలేటి కొండ, శీలబోయిన రామకృష్ణ, చల్లా సత్తియ్య, పంపన సత్యనారాయణ, గ్రామ సంరక్షణ కార్యదర్శులు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.



అత్తిలి మండలం తిరుపతిపురంలో పోషణ మాసోత్సవ కార్యక్రమంలో మాట్లాడుతున్న సీడీపీఓ ప్రమోదకుమారి

పోషకాలతో కూడిన ఆహారం తీసుకోవాలి

తాడేపల్లిగూడెం రూరల్: గర్భిణులు పోషకాలతో కూడిన ఆహారం తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కే.శ్రీదేవి అన్నారు. బుధవారం మండలంలోని ఆరుగొలను నెం.130, 131 అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో పోషకాహార మాసోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీదేవి మాట్లాడుతూ ముడి మినుముల్లో గర్భిణులకు అవసరమైన పోషకాలు మెండుగా ఉన్నాయని, వాటిని ఆహారంలో తీసుకోవాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో అందించే పోషకాహారాన్ని గర్భిణులు, బాలింతలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్ కృప, అంగన్‌వాడీ కార్యకర్తలు ఎస్‌కే.కాజా బీ, జీఎస్ఎన్.నాగలక్ష్మి, బి.రాణి, ఆశ వర్కర్ జి.దుర్గా భవాని తదితరులు పాల్గొన్నారు.

స్కూల్ గేమ్స్‌లో 'భవన్స్' విద్యార్థుల ప్రతిభ



యోగా పోటీల్లో ప్రతిభ కనబర్చిన తాడేపల్లిగూడెం మండలం పెదతాడేపల్లి భారతీయ విద్యాభవన్స్ విద్యార్థులు

తాడేపల్లిగూడెం రూరల్: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగిన జిల్లా స్థాయి క్రీడా పోటీల్లో తాడేపల్లిగూడెం మండలం పెదతాడేపల్లి భారతీయ విద్యాభవన్స్ విద్యార్థులు ప్రతిభకనబర్చి గుంటూరులో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికై నట్లు ప్రిన్సిపల్ రాజీవ్‌కుమార్ శర్మ తెలిపారు. ఏలూరు కేపీడీటీ హైస్కూలులో జరిగిన హ్యాండ్ బాల్‌పోటీల్లో అండర్–14 బాలికల విభాగంలో జి.హేమశ్రీ, బాలుర విభాగంలో లక్ష్మీ సాయి చరణ్, మోహిత్, అండర్–17 బాలుర విభాగంలో నాగ అవినాష్, ప్రేమ్ సాయి, ఈశ్వర్‌రామస్ చందు, సాయి గణేష్ ఎంపికయ్యారన్నారు. ఈ నెల 29వ తేదిన గుంటూరు జిల్లా తెనాలిలో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. అలాగే, యోగా పోటీల్లో అండర్–14 బాలుర విభాగంలో టి.భార్గవ్ కార్తీక్, సీహెచ్.దీపక్, కే.సాత్విక్ వర్మ, అండర్–17 బాలికల విభాగంలో ఎస్.తస్లీం, ఐ.అర్పితా భవానీ ఎంపికైనట్లు వివరించారు. ఈ సందర్భంగా బుధవారం స్కూల్ ఆవరణలో వారికి అభినందన కార్యక్రమం నిర్వహించారు. క్రీడాకారులను స్కూల్ చైర్మన్ చెరుకువాడ శ్రీరంగనాథరాజు (రంగరాజు), కార్యదర్శి గోపాలకృష్ణంరాజు, కోశాధికారి గ్రంధి సాయిబాబా వరప్రసాద్, కమిటి సభ్యులు నరసింహరాజు, పీఎస్ఎస్.మూర్తి, శివరామరాజు, వ్యాయామో పాధ్యాయులు, ఉపాధ్యాయ సిబ్బంది అభినందించారు.

చురుగ్గా జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే

తణుకు టౌన్: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా మండలంలోని వేల్పూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని గ్రామాల్లో బుధవారం ఏఎన్ఎంలు, వలంటీర్లు సర్వే కార్యక్రమం నిర్వహించారు. బుధవారం మండలంలోని వేల్పూరు, తేతలి, దువ్వ, ముద్దాపురం, కోనాల, కొమరవరం, యర్రాయి చెరువు, మహాలక్ష్మీ చెరువు, రేలంగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని మండపాక, గ్రామాల్లో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంపై సర్వే నిర్వహించారు. ఈసర్వేలో ప్రతి ఇంటికి వెళ్లి బీపీ, సుగర్, కళ్లు, కళ్లెం పరీక్షలు నిర్వహించి నమోదు చేస్తున్నారు.

సర్టిఫికేట్స్ పోయినవి

నంబూరి వి. సూర్యనారాయణ సుబ్రహ్మణ్య వర్మ తండ్రి చంద్రరాజు, గుమ్ములంపాడు నేను గుమ్ములంపాడు నుండి అత్తిలి నా డిగ్రీ (B.Tech) సర్టిఫికేట్స్ జిరాక్స్ కి(18.9.2023) బైక్‌మీద వెళ్ళుచుండగా మార్గమధ్యలో పడిపోయినవి. దొరికిన వారు తెలుపగలరు. సంప్ర: 9494911245

మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలి

పెంటపాడు: ప్రతి విద్యార్థి మాదకద్రవ్యాల నిరోదానికి కృషి చేయాలని గూడెం స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ (ఎస్‌ఐబీ) సీఐ బి.సత్యనారాయణ పేర్కొన్నారు. పెంటపాడు డీఆర్ గోయంకా ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులకు మాదకద్రవ్యాలపై ఒక్కరోజు అవగాహన సదస్సు నిర్వహించారు. కళాశాల అధ్యాపకులు గంధం వాణి, ఎన్‌సీసీ కోఆర్డినేటర్, యు ప్రేమ్‌సాగర్ పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సాయం మరువలేనిది



సమావేశంలో మాట్లాడుతున్న గ్రామ ఉప సర్పంచ్ కొవ్వూరి ప్రసాద్‌రెడ్డి

పెంటపాడు: తాము చదువుకొన్న పాఠశాలకు పూర్వ విద్యార్థులు అందిస్తున్న సాయం మరువలేనిదని పెంటపాడు గ్రామ ఉపసర్పంచ్ కొవ్వూరి ప్రసాద్‌రెడ్డి, బేసిక్‌స్కూలు హెచ్‌ఎం ఎన్.రాజేష్‌లు పేర్కొన్నారు. పెంటపాడు ప్రభుత్వ బేసిక్ పాఠశాలకు 1985–86 పదోతరగతి చదువుకొన్న పూర్వ విద్యార్థుల సాయంతో రూ. 2.60 లక్షల వ్యయంతో నిర్మించిన రెండు సైకిల్‌షెడ్లు బుధవారం ప్రారంభించారు. 15 రోజులలో గ్రామ ఉప సర్పంచ్ కొవ్వూరి ప్రసాద్‌రెడ్డి బాధ్యతగా తీసుకొని త్వరితగతిన షెడ్లు నిర్మాణం పూర్తయ్యేలా కృషి చేశారు. బుధవారం ఆ షెడ్లను పూర్వ విద్యార్థులైన కర్రి సురేష్‌రెడ్డి(యుఎస్‌ఏ), సాదిమెళ్ల సత్యనారాయణ (కువైట్)లు ప్రారంభించారు. ఈ సందర్భంగా కర్రి ప్రణవ్ శ్రీకర్ జ్ఞాపకార్థం తల్లిదండ్రులైన కర్రి ఝాన్సీలక్ష్మి, కర్రి సురేష్‌రెడ్డి(యుఎస్‌ఏ)లు రూ. 1.20 లక్షల వ్యయంతో బాలుర కోసం ఒక షెడ్డు నిర్మించగా బాలికల షెడ్డు కోసం రూ. రూ.1.45 లక్షలకు గాను, సాదిమెళ్ల సత్యనారాయణ(70వేలు), కొవ్వూరి ప్రసాద్‌రెడ్డి(20 వేలు)లను విరాళంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు ఏడుకొండలు, నరసయ్య, రవికుమార్, రాఘవరెడ్డి, శంకర్, తదితరులు పాల్గొన్నారు.